# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 15-06-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ భారత్, స్లోవేకియాలు తమ సంబంధాలను సమగ్ర భాగస్వామ్య స్థాయికి పెంచుకోవాలని నిర్ణయించుకున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు.
- ❖ గడచిన 12 సంవత్సరాల్లో దేశంలోని విమానాశ్రయాల సంఖ్య 74 నుండి 165కు పెరిగిందని కేంద్రమంత్రి కె. రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.
- ❖ దేశంలో పవన విద్యుత్ రంగం వేగవంతంగా అభివృద్ధి చెందుతోందని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి తెలియజేశారు.
- ❖ దేశ అభివృద్ధి ప్రయాణంలో శాస్త్ర, సాంకేతిక రంగాలు కీలక చోదకశక్తులుగా నిలిచాయని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ వెల్లడించారు.

========================

భారత్ - ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం భారత్ - యురోపియన్ యూనియన్ల ఆర్థిక సంబంధాలలో కీలక ఘట్టంగా నిలుస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఈరోజు బ్రాటిస్లావాలో స్లోవాక్ ప్రధానమంత్రి రాబర్ట్ ఫికోతో ప్రతినిధి బృంద స్థాయి చర్చలు జరిపారు. చర్చల అనంతరం జరిగిన సంయుక్త విలేకరుల సమావేశంలో మోదీ మాట్లాడుతూ... భారత్, స్లోవేకియాలు తమ సంబంధాలను సమగ్ర భాగస్వామ్య స్థాయికి పెంచుకోవాలని నిర్ణయించుకున్నాయని తెలిపారు. ఇరు దేశాల మధ్య భవిష్యత్ సహకారానికి డిజిటల్ టెక్నాలజీ కీలకంగా ఉంటుందని, డిజిటల్ టెక్నాలజీపై కుదిరిన ఒప్పందం, డిజిటల్ మౌలిక సదుపాయాలు, ఆవిష్కరణల ఆధారిత సహకారంలో కొత్త అవకాశాలను తెరుస్తుందని నరేంద్ర మోదీ వివరిస్తూ...

(వాయిస్ 30 సెకెన్లు)

స్లోవాక్ ప్రధానమంత్రి రాబర్ట్ ఫికో మాట్లాడుతూ... ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారతదేశాన్ని శాశ్వత సభ్య దేశంగా చేర్చుకోవాలన్నారు. భారత్ వేగవంతమైన ఆర్థిక వృద్ధిని, డిజిటల్ పరివర్తనను, కృత్రిమ మేధస్సులో

పురోగతిని ప్రశంసించిన ఆయన.. కీలక రంగాలలో భారతదేశం అనేక అభివృద్ధి చెందిన దేశాలను అధిగమించిందన్నారు. స్వేచ్ఛా వాణిజ్యం కోసం ఈయూ, భారత్ ల మధ్య కుదిరిన ఒప్పందాన్ని స్లోవేకియా స్వాగతిస్తోందని, రక్షణ పరిశ్రమ రంగంలో సహకారానికి తాము కూడా ఆసక్తిగా ఉన్నామని రాబర్ట్ ఫికో పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

=========================

గడచిన 12 సంవత్సరాలలో దేశంలోని విమానాశ్రయాల సంఖ్య 74 నుండి 165కు పెరిగిందని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఉత్తరప్రదేశ్ జేవార్‌లోని నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయంలో వాణిజ్య విమాన కార్యకలాపాలు ఈరోజు ప్రారంభమైన సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ... ఈ విమానాశ్రయం దేశీయ, అంతర్జాతీయ కార్యకలాపాలకు కేంద్రంగా పని చేస్తుందన్నారు. గత దశాబ్ద కాలంలో విమానాశ్రయ మౌలిక సదుపాయాల కోసం లక్షా 40 వేల కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడులు పెట్టడం జరిగిందని తెలిపారు. ప్రపంచ స్థాయి విమానయాన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనికత ఫలితమే ఈ విమానాశ్రయం అని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

=========================

దేశంలో పవన విద్యుత్ రంగం వేగవంతంగా అభివృద్ధి చెందుతోందని కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. గోవాలో ఈరోజు జరిగిన "గ్లోబల్ విండ్ డే-2026" జాతీయ సదస్సులో ఆయన.. విండ్ టర్బైన్ సప్లై చైన్ మేనేజ్‌మెంట్ (డబ్ల్యూటీ-మరుత్) పోర్టల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రహ్లాద్ జోషి మాట్లాడుతూ.. గత సంవత్సరంతో పోలిస్తే దేశంలో పవన విద్యుత్ 46 శాతం పెరుగుదలను నమోదు చేసిందన్నారు. దేశంలో పవన విద్యుత్ సామర్థ్యం 56.1 గిగావాట్లను అధిగమించడంతో.. ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద పవన విద్యుత్ మార్కెట్‌గా మనదేశం నిలిచిందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పవన టర్బైన్లు, సంబంధిత భాగాల ఎగుమతులు 12 వేల కోట్ల రూపాయలను దాటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆ శాఖ సహాయ మంత్రి శ్రీపాద యశో నాయక్ మాట్లాడుతూ.. స్వచ్ఛ ఇంధన సాంకేతికతలను మరింతగా అవలంబించడం ద్వారా ఖచ్చితమైన శూన్య కర్బన ఉద్గారాలను సాధించేందుకు భారత్ కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు.

విరామం

=========================

దేశ అభివృద్ధి ప్రయాణంలో శాస్త్ర, సాంకేతిక రంగాలు కీలక చోదకశక్తులుగా నిలిచాయని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. 'భారతదేశ సేవలో 12 ఏళ్ల శాస్త్ర విజ్ఞానం' అనే అంశంపై న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... శాస్త్ర ఆధారిత అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించడం వల్ల, ప్రధాన జాతీయ మిషన్లు, ప్రతిష్టాత్మక కార్యక్రమాలలో సాంకేతికత ఒక అంతర్భాగంగా మారిందన్నారు. గత దశాబ్ద కాలంలో దేశ బయో ఎకానమీ గణనీయంగా విస్తరించిందన్న ఆయన.. అంతరిక్ష, జియో స్పేషియల్, అణు రంగాలలో చేపట్టిన సంస్కరణలు ప్రైవేటు రంగ భాగస్వామ్యాన్ని విస్తరించి, దేశ శాస్త్రీయ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేశాయని తెలిపారు. విధాన సంస్కరణలు, ఆవిష్కరణలు, సంస్థాగత మద్దతు కలయికతో దేశం సైన్స్, టెక్నాలజీలో కీలక ప్రపంచ శక్తిగా ఆవిర్భవించిందని జితేంద్ర సింగ్ పేర్కొన్నారు.

=========================

పశ్చిమాసియాలో ఘర్షణకు ముగింపు పలికేందుకు అమెరికా, ఇరాన్ దేశాల మధ్య కుదిరిన అవగాహనను భారత్ స్వాగతించింది. ఈ అవగాహన అమలు చేయడం ద్వారా ఆ ప్రాంతంలో శాంతి, స్థిరత్వాలు

పునరుద్ధరించబడతాయని, అలాగే.. స్వేచ్ఛా నౌకాయానానికి, వాణిజ్యానికి భరోసా లభిస్తుందని భారత్ ఆశిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు. మిగిలిన అంశాలపై చర్చించి.. ఒక సుస్థిరమైన తుది ఒప్పందాన్ని కుదుర్చుకునే దిశగా ముందుకు సాగాలని భారత్ ఆశిస్తోందని ప్రధానమంత్రి తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అంతర్జాతీయ యోగా దినోత్సవం-2026 ప్రధాన జాతీయ కార్యక్రమం ఈనెల 21వ తేదీన కోల్‌కతాలో జరుగుతుందని కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి ప్రతాప్‌రావు జాదవ్ తెలిపారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవం-2026 సన్నాహక విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... "ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా" అనే ఇతివృత్తంతో జరగనున్న ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వం వహిస్తారని చెప్పారు. వయసు పైబడే కొద్దీ ప్రజలు ఆరోగ్యకరమైన, స్వయం సమృద్ధి గల, మానసికంగా దృఢమైన జీవితాలను గడపడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు ఇప్పుడు యోగాను తమ దైనందిన జీవితంలో అంతర్భాగంగా చేసుకున్నారని తెలిపారు. ఈ సంవత్సరం అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ప్రపంచ వ్యాప్తంగా అపూర్వమైన మద్దతు లభించిందని కేంద్రమంత్రి తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జాతీయ స్థాయిలో "వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్-2026"ను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా.. న్యూఢిల్లీలో రేపు ప్రారంభించనున్నారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ప్రజాస్వామ్య ప్రక్రియలతో యువత భాగస్వామ్యాన్ని పునఃసమీక్షిస్తుందని మంత్రిత్వ శాఖ తెలిపింది. అలాగే.. యువ పౌరులకు పరిపాలన, విధాన చర్చలు, పార్లమెంటరీ పనితీరుపై ప్రత్యక్ష అవగాహనను అందిస్తుందని పేర్కొంది. వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ అనేది దేశ యువత ఆలోచనలు, ఆకాంక్షలను జాతీయ చర్చలోకి తీసుకువచ్చే ఒక ఉద్యమం అని ఆ మంత్రిత్వ శాఖ  వివరించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్ రాష్ట్రాలకు కొత్త నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (NCC) రాష్ట్ర డైరెక్టరేట్ల ఏర్పాటుకు రక్షణ మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. దీంతో దేశంలో NCC రాష్ట్ర డైరెక్టరేట్ల మొత్తం సంఖ్య 19కి పెరిగింది. ఈ కొత్త డైరెక్టరేట్ల వల్ల, గణతంత్ర దినోత్సవ పరేడ్ శిబిరం, అఖిల భారత తల్ సైనిక్ శిబిరం వంటి శిబిరాలలో ఎక్కువ మంది క్యాడెట్లు పాల్గొనేందుకు వీలు కలుగుతుందని ఆ మంత్రిత్వ శాఖ తెలియజేసింది. అలాగే.. పర్వతారోహణ, ట్రెక్కింగ్, పారాసైలింగ్ వంటి సైనిక శిక్షణ, సాహస కార్యకలాపాలలో క్యాడెట్లకు మరింత విస్తృత అనుభవం లభిస్తుందని వివరించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు భారీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 75 వేల 527 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై.. చివరికి 737 పాయింట్ల లాభంతో 76 వేల 264 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 231 పాయింట్లు లాభపడి 23 వేల 853 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 94 రూపాయల 71 పైసలుగా ఉంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = =